క్లుప్తంగా

మోదీతోనే దేశాభివృద్ధి



వనపర్తి రూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశాభివృద్ధి పరుగులు పెడుతుందని బీజేపీ జిల్లా నాయకుడు మెంటపల్లి పురుషోత్తంరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మెంటెపల్లిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ తన సత్తాచాటేందుకు గ్రామంలో అందరూ బీజేపిలో సభ్యత్వాలు తీసుకొని అండగా ఉండాలని కోరారు. అనంతరం గ్రామస్తులతో సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో వనపర్తి మండల అధ్యక్షుడు వెంకటేష్, సోషల్‌మీడియా కన్వీనర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



ఖిల్లాఘనపురం: సైబర్ నేరగాళ్లతో యువత అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జ్ ఎస్‌ఐ సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వాడకం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఫోన్లకు వచ్చే అనవసరం లింక్‌లను, అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు చెప్పకూడదని వివరించారు. యువత గంజాయి, మద్యం తదితర మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయని వివరించారు. ఆన్‌లైన్ మోసాల గురించి యువత గ్రామాల్లోని తల్లిదండ్రులు, చుట్టు పక్కల వారికి చెప్పాలన్నారు.

విద్యార్థులకు బెడ్‌షీట్లు అందజేత



మదనాపురం: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో బుధవారం వార్డెన్ బెనర్జి విద్యార్థులకు బెడ్ షీట్లు, కార్పెట్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలకు అందిపుచ్చుకొని ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్యూటర్స్ చెన్నయ్య, బుచ్చన్న, రవికుమార్ పాల్గొన్నారు.

మొసలి స్థావరం పరిశీలన



వీపనగండ్ల: మండలంలోని కల్వరాల అవుటకుంటలో మొసలి సంచరిస్తూ గ్రామ సమీపంలోని ప్రధాన రోడ్డుపైకి వస్తుండడంతో గ్రామస్తులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. మొసలి ఏర్పాటు చేసుకున్న స్థావరాన్ని పరిశీలించేందుకు బుధవారం ఫారెస్ట్ అధికారిణి రాణి గ్రామాన్ని సందర్శించి మొసలితో గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రాత్రి వేళలో పలువురు మొసలి చూసి కిందపడ్డ ఘటనలు ఉన్నాయని కాంగ్రెస్ నాయకుడు నర్సింహ, మాజీ సర్పంచ్ హుస్సేన్, విండో డైరెక్టర్ జుర్రు నర్సింహ, సుధాకర్, జిల్లా అధికారులు స్పందించి మొసలిని బంధించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



మదనాపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14 ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను ప్రధానోపాధ్యాయుడు మద్దిలేటి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి యువజన క్రీడల జిల్లా అధికారి సుధీర్ కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయన్నారు. పోటీల్లో మదనాపురం, దుప్పల్లి, అజ్జకొల్లు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో పాటు సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కేజీబీవీ ఉన్నత పాఠశాల నుంచి మొత్తం 150 విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. విద్యార్థులకు 1982–83 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు స్పోర్ట్స్ డ్రస్సులు ఉచితంగా అందజేయగా.. గ్రామస్తులు ఆర్థిక తోడ్పాటు అందించారు.

గేదె మృతి

పెద్దకొత్తపల్లి: మండలంలోని మహాసముద్రంలో బెల్లె చంద్రశేఖర్‌కు సంబంధించిన గేదె విద్యుదాఘాతంతో బుధవారం మృతిచెందింది. కేఎల్‌ఐ కాలువలో నీళ్లు తాగేందుకు వెళ్లి గేదె మృతిచెందినట్లు రైతు తెలిపాడు. గేదె విలువ రూ.65 వేలు ఉంటుందని పేర్కొన్నారు.



నాగర్‌కడ్మూర్‌లో..



మహ్మద్‌హుస్సేన్‌పల్లి రోడ్డులో..



వనపర్తిలో..

గంగమ్మ ఒడికి గణనాథుడు

ఆత్మకూర్: భక్తిపారవశ్యంతో గణనాథుడి నిమజ్జనాన్ని బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. స్థానిక ఆర్కే కాలనీలో ప్రతిష్ఠించిన మట్టి గణపయ్యకు ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. అలాగే స్థానిక భార్గవినగర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి ఆధ్వర్యంలో వినాయక మండపాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు. ఆర్కేకాలనీలో మహిళల కోలాటం, భవానీ కళాకారుల డప్పుల వాయిద్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన ర్యాలీలో వేలాదిగా పాల్గొన్నారు.

అమరచింత: మండలంలోని చంద్రగఢ్, నాగల్‌కడ్మూర్, నందిమళ్ల, పాంరెడ్డిపల్లి గ్రామాల్లో బుధవారం గణేష్ విగ్రహ నిమజ్జనోత్సవ కార్యక్రమాలు ప్రశాంతకర వాతవారణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడి లడ్డు ప్రసాదాలను వేలం పాటలో భక్తులు కైవసం చేసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించామని ఎస్‌ఐ సురేష్ తెలిపారు.



ఆత్మకూర్‌లో భవానీ కళాకారుల డప్పుల వాయిద్యాలు

మండపాల వద్ద అన్నదానం

పట్టణంలోని పలు వార్డుల్లో కొలువుదీరిన వినాయక మండపాల వద్ద నిర్వాహకులు బుధవారం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. గణేష్‌నగర్‌లోని వినాయక మండపం వద్ద ప్రముఖ జరి చీరల వ్యాపారి మహంకాళి శ్రీనివాస్ అన్నదానం చేశారు. కార్యక్రమంలో చిన్ని సీతారాములు, కొంకతి నరసింహ, ఒగ్గు రామలింగం, గాజుల వెంకటేష్, చిన్ని లక్ష్మి, కొంకతి అలివేలమ్మ, సువర్ణ, సంధ్య, కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండల కేంద్రంలో కచ్చీర్ చెట్టు, ప్రాథమిక రోగ్య కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. అనంతరం గణనాథులను గ్రామ సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేశారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని నూతన మార్కెట్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఆదర్శయువజన సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు టప్పరాజు, నరేందర్, హరికృష్ణ, శ్రీను, శివశంకర్, ప్రతాప్ తదితరులు తెలిపారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

మండల కేంద్రం నుంచి మహ్మద్‌హుస్సేన్‌పల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఉన్న అల్లిపేటగుట్టపై వెలసిన శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో బుధవారం ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. అక్కడే నూతనంగా ప్రతిష్ఠించిన వినాయకుడికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేసిన ఖిల్లాఘనపురం, వెంకటాంపల్లి గ్రామస్తులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి చెంతన ఉంచిన లడ్డును ప్రజలకు ప్రసాదంగా పంచారు. కార్యక్రమంలో పురుషోత్తం ముదిరాజ్, లక్ష్మణ్, అంజి, మహేష్, సురేష్, చందు, వెంకటేష్, మధు, శివ పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో మహిళల కోలాటం



అమరచింతలోని బీసీ కాలనీలో..



వీపనగండ్లలో..



ఖిల్లాఘనపురంలో..

పారిశుద్ధ్య నివారణ చర్యలు నిరంతర ప్రక్రియ

పాన్‌గల్: పారిశుద్ధ్య నివారణ చర్యలు నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ గోవింద్‌రావు సిబ్బందికి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య నివారణ చర్యలు, పరిసరాల శుభ్రతపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. జీపీల్లోని నర్సరీల్లో మిగిలిపోయిన మొక్కలను సంరక్షించాలని ఆదేశించారు. త్వరలో మండలంలో నిర్వహించే ఉపాధి హామీ సోషల్ అడిట్‌కు సంబంధించి అన్ని రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. స్థానిక సంస్థలకు సంబంధించిన ఓటరు జాబితాను అన్ని జీపీల్లో ఈనెల 13వ తేదీన ప్రదర్శించాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏపీఓ కుర్మయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మహిళను ఢీకొట్టిన బైక్

పాన్‌గల్: ద్విచక్ర వాహనం మహిళను ఢీకొట్టిన ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్‌కు చెందిన బాలచంద్రమ్మ కొంతమంది మహిళలతో కలిసి పొలానికి వెళ్తుండగా ప్రెస్‌క్లబ్ సమీపంలో వెనుక నుంచి ఇదే గ్రామానికి చెందిన కృష్ణయ్య బైక్‌ను అజాగ్రత్తగా వేగంగా నడుపుతూ ఢీకొట్టాడు. దీంతో ఆమె సీసీ రోడ్డుపై కిందపడటంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే ఆమెను అంబులెన్స్‌లో జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించగా.. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. బాధిత మహిళ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



శాగాపూర్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్‌తండా ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సిరాజ్‌ద్దీన్, రవికుమార్‌ను బుధవారం ఉపాధ్యాయ బృందం, తండావాసులు, విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం నాగరాజు మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడికి బదిలీ, పదవీ విరమణ తప్పనిసరి అని, విధుల నిర్వహణలో వారు చేసిన సేవలు చిరకాలం గుర్తుంటాయన్నారు.



కొత్తకోటలో శంకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ కృష్ణయ్య

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

కొత్తకోట రూరల్: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ గెజిటెడ్ హెచ్‌ఎంగా ఇటీవల అవార్డు అందుకున్న పి.శంకర్‌గౌడ్‌ను కొత్తకోట మండల ప్రభుత్వ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ గెజిటెడ్ హెచ్‌ఎంలు బుధవారం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణయ్య, డీసీఈబీ చంద్రశేఖర్, మద్దిలేటి, గణేష్‌కుమార్, శంకరయ్య, రమేష్, కేశవాచారి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన రామచంద్రయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్ స్థానిక నాయకులతో కలిసి మృతదేహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో శ్రీహరిరాజు, బీరం రాజశేఖర్‌రెడ్డి, ఆశన్న, రమేష్, వెంకటయ్య, జావిద్, రాజాగౌడ్ పాల్గొన్నారు.

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 8వ వార్డు శ్రీనివాసపురానికి చెందిన దేవర్ల బుచ్చన్న, 6వ వార్డుకు చెందిన బొజ్జమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి సూచన మేరకు పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ బుధవారం మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య, నాయకులు రాములు, బాలస్వామి, నరసింహ, శివ, చిన్నకృష్ణ, మన్యం, రవీంద్రనాయక్ తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణరంగ కార్మికులను ఆదుకోవాలి

ఆత్మకూర్: భవన నిర్మాణరంగ కార్మికుల సమస్యలన్నింటిని పరిష్కరించాలని, ఇన్సూరెన్స్ అమలును ఎల్‌ఐసీకి అప్పజెప్పాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని జూరాలలో భవన నిర్మాన కార్మికులతో సంతకాల సేకరణ చేపట్టారు. కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, ప్రమాదబీమా రుసుంను రూ.10 లక్షలకు పెంచాలని కోరారు. అన్ని రకాల మరణాలు, అంగవైకల్యానికి ఇన్సూరెన్సు వర్తింపజేయాలని, ఆరోగ్య పరీక్షలు చేయించాలని, లేబర్ అధికారుల ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొండన్న, కృష్ణ, ఖాసీం, దస్తగిరి, రాములు, పరశురాముడు, బాలస్వామి, సత్యన్న, మహేష్, కుక్కలశ్రీను, మద్దిలేటి, సాయిలు తదితరులు ఉన్నారు.



జూరాలలో సంతకాలు సేకరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

అస్తవ్యస్తంగా జూరాల ప్రాజెక్టు రహదారి

అమరచింత: ఉమ్మడి జిల్లాకే వరప్రదాయినిగా ఉన్న ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు రహదారి అధ్వాన్నంగా తయారైంది. ప్రాజెక్టుకు వెళ్లే బీటీ రహదారితో పాటు ప్రాజెక్టుపై గుంతలు పడటంతో ప్రయాణం ఇబ్బందిగా మారినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు, పర్యాటకులు ఆరోపిస్తున్నారు. 13 ఏళ్ల నుండి ప్రాజెక్టు రహదారిపై మరమ్మతు చేపట్టని పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రతి వర్షాకాలంలో రహదారి దెబ్బతిని గుంతలు ఏర్పడటంతో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు. దీనికి తోడు ప్రాజెక్టుపై నుంచి భారీ వాహనాలకు అనుమతి లేకున్నా రాకపోకలు కొనసాగుతుండటంతో రహదారి మరింత దెబ్బతినే స్థాయికి చేరుకుంది. ప్రాజెక్టుపై రహదారికి ఒక వైపు ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు రాత్రి వేళలో వెలగకపోవడంతో రాత్రుల్లో ప్రయాణం ప్రమాదభరితంగా తయారైంది. విద్యుత్ బల్బులను వెలిగించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి మరమ్మతులతో పాటు విద్యుత్ బల్బులు బిగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



అంధకారంలో జూరాల ప్రాజెక్టు రోడ్డు

ఎంపీడీఓ కార్యాలయంలో ఇద్దరే అధికారులు

వీపనగండ్ల: వెనకబడ్డ గ్రామాల ప్రజల అభివృద్ధిలో కీలక ప్రాత పోషించాల్సిన ఎంపీడీఓ కార్యాలయంలో ఇద్దరే అధికారులు ఉండడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్యాలయంలో ఎంపీడీఓగా శ్రీనివాసరావు, టైపిస్ట్‌గా స్వప్న విధులు నిర్వహిస్తుండగా.. సూపరింటెండెంట్ పోస్టుతో పాటు సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు అటెండర్లు, ఒక వాచ్‌మెన్ పోస్టు ఖాళీగా ఉంది. ఇటీవలే జూనియర్ అసిస్టెంట్‌గా బదిలీపై కార్యాలయానికి వచ్చిన అధికారిని డిప్యూటేషన్‌పై సీఈఓ కార్యాలయానికి తీసుకున్నారు. గృహజ్యోతి పథకంతో పాటు గ్యాస్ సబ్సిడీల నమోదు కోసం ఇబ్బందులు అవుతున్న విషయాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావుకు స్థానిక కాంగ్రెస్ నాయకులు విన్నవించగా.. జెడ్పీ సీఈఓకు మంత్రి ఫోన్ చేసి తాత్కాలికంగా ఇద్దరు అధికారులను నియమించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించినా సీఈఓ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బడికి దూరమైతే భవిష్యత్ ఆగమే

కేటీదొడ్డి: విద్యార్థులు బడికి దూరమైతే భవిష్యత్ ఆగమవుతుందని హెచ్‌ఎం ఆంజనేయులు అన్నారు. బుధవారం మండలంలోని మల్లాపురం పాఠశాలలో ఎంవీఎఫ్ సభ్యులు కిరణ్ ఆధ్వర్యంలో బడిబయటి పిల్లలపై ఒక్కరోజు మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడికి పంపకుండా వ్యవసాయపనులకు తీసుకెళ్లటం మంచిది కాదని తల్లిదండ్రులకు సూచించి, వివిధ పనుల్లో ఉన్న 51 మంది పిల్లలను బడికి తీసుకొచ్చినట్లు తెలిపారు. టీఎల్‌ఎం ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలకృష్ణ, తదితరులు ఉన్నారు.

సమయ పాలన పాటించాలి

కోడేరు: మండలంలోని కొండ్రావుపల్లి, ఎత్తం, నర్సాయిపల్లి, మైలారం, తదితర పాఠశాలలను ఎంఈఓ భాస్కర్‌రెడ్డి బుధవారం పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయ పాలన ప్రకారం విధులకు హాజరు కావాలని అన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు.

సీఎం నిర్ణయంపై రజకుల హర్షం

కొల్లాపూర్: కోఠి ఉమెన్స్ మహిళా యూనివర్సిటీకి తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ పేరును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై రజక సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం వారు పట్టణంలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో రజకసంఘం జిల్లా అధ్యక్షుడు చాకలి నర్సింహ, యాపట్ల చంద్రశేఖర్, తిప్పరాజుల సన్నీ, నాయకులు చిన్న మహంకాళి, పరశురాముడు, జగదీష్ తదితరులున్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని చుక్కాయిపల్లిలో అమర్చిన 6 సీసీ కెమెరాలను డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. రూ.లక్షతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మూడో వార్డు కౌన్సిలర్‌ను అభినందించి సన్మానించారు. అనంతరం గ్రామంలో వినాయక మండపాలను డీఎస్పీ సందర్శించారు. కార్యక్రమంలో సీఐ మహేష్, ఎస్‌ఐ హృషికేష్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన ఆర్టీసీ అద్దె బస్సు

- ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించబోయి ఘటన
- రోడ్డు దిగడంతో మట్టిలో కూరుకుపోయిన టైర్
- 50 మంది ప్రయాణికులకు తప్పిన ప్రమాదం

వనపర్తిటౌన్: గద్వాల నుంచి వనపర్తికి 50 మంది ప్రయాణికులతో వస్తున్న గద్వాల డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సుకు పెను ప్రమాదం తప్పింది. బుధవారం మధ్యాహ్నం 1:45 నిమిషాలకు గద్వాల నుంచి బయలుదేరిన బస్సు 3 గంటల సమయంలో వనపర్తి శివారులోకి తిరుమలయ్యగుట్ట సమీపంలోకి రాగానే అదుపు తప్పింది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి నుంచి కర్నూల్‌కు వెళ్తున్న డీలక్స్ బస్సు వెనుక నుంచి ఓ ద్విచక్రవాహనం వేగంగా దానిని ఓవర్ టెక్ చేసేందుకు ప్రయత్నించింది. దీంతో ఆ ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో గద్వాల డిపో బస్సు డ్రైవర్ మౌలాలి బీటీ రోడ్డు కిందకి దించాడు. బస్సు ముందు టైర్ పూర్తిగా మట్టిలో కూరుకుపోవడంతో కుదుపులకు గురికాగా.. ప్రయాణికులు అటు ఇటూ పడడంతో పాటు ఆందోళనకు గురయ్యారు. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా మట్టిలో ఇరుక్కుపోయిన బస్సు బయటకు రాకపోవడంతో ప్రయాణికులను వేరే బస్సులో వనపర్తికి తరలించారు. వనపర్తిలో ఉండే అద్దె బస్సు యజమానికి డ్రైవర్ మైలాలి సమాచారం ఇవ్వడంతో.. బస్సును జేసీబీ సాయంతో సుమారు గంట తర్వాత బయటకు తీయడంతో రాకపోకలకు మార్గం సుగమమైంది.



అదుపు తప్పిన బస్సు

'అభివృద్ధి పేరుతో అంతా దోచేశారు'



పెబ్బేరులో క్రీడాకారిణిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్

వనపర్తి రూరల్: గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పేరుతో అంతా దోచేశారని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం ఆయన శ్రీరంగాపురం ఎంపీడీఓ కార్యాలయంలో 26, పెబ్బేరులో 56 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. గత పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్‌కార్డు కూడా జారీ చేయలేదని గుర్తుచేశారు. ఈ ప్రభుత్వం త్వరలో నిరుపేదలకు రేషన్ కార్డులను అందించే దిశగా అడుగులు వేస్తుందన్నారు. రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు వివిధ రకాల కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల, వసతిగృహాల విద్యార్థులకు యూనిఫాంలను కుట్టే బాధ్యతను మహిళలకు అప్పగించిందని చెప్పారు.

క్రీడాకారులకు సన్మానం

పెబ్బేరు మండల కేంద్రంలోని పీజేపీ ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ కె శివసేనారెడ్డి, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణకుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీ అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారిణి గుగులోతు సౌమ్యను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్లు లక్ష్మి, మురళి, ఎంపీడీఓ రవీంద్ర, మున్సిపల్ కౌన్సిలర్లు పార్వతి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, సురేందర్‌గౌడ్, వెంకటేష్‌సాగర్, శ్రీహరిరాజు, బీరం రాజశేఖర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి ఉన్నారు.